

విద్యుత్ సమస్యలకు..

పాతపట్నంలో విద్యుత్ సమస్యలకు చెక్ పడనుంది. కొత్త సబ్‌స్టేషన్ నిర్మించనున్నారు. - 8లో



వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వాహనం ఢీకొట్టి ఓ వ్యక్తి మృతి చెందాడు. తర్లాకోట వద్ద ప్రమాదం జరిగింది. - 8లో



శ్రీముఖలింగం శిఖరంపై జ్వాలాతోరణం

జలుమూరు: శ్రీముఖలింగంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రధాన దేవాలయంలో శిఖరం పైన జ్వాలా తోరణం నిర్వహించారు. అర్చకులు దేవాలయ శిఖరానికి ప్రత్యేక పూజలు నిర్వహించి దీపం అలంకరించారు.

న్యూస్‌రీల్

నేడు ఎన్నికల పరిశీలకుడు జె.శ్యామలరావు రాక

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల జాబితా పరిశీలకునిగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి జె.శ్యామల రావు సోమవారం జిల్లాకు రానున్నారు. విద్యాశాఖలో ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేస్తున్న ఆయనను జిల్లా ప్రత్యేక పరిశీలకునిగా ఎన్నికల కమిషన్ నియమించింది. సోమవారం జిల్లాకు చేరుకొని మంగళవారం ఉదయం ఆయన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులతో కలెక్టర్ కార్యాలయంలో 10 గంటలకు సమావేశం అవుతారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ రోజు నుంచి ఇప్పటి వరకు జరిగిన ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తీసుకున్న చర్యలపై ఆయన సమీక్ష నిర్వహించనున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ దుప్పల వెంకటరమణకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: ప్రఖ్యాత సూర్యనారాయణ స్వామిని మధ్యప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ కుటుంబ సమేతంగా ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల బృందం పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. వారి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ విశిష్టతను శంకరశర్మ వివరించారు. అనంతరం అనివేటి మండపంలో వేదాశీర్వచనాన్ని చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోటోకాల్ న్యాయమూర్తి కె.రాణి, ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ, వన్‌టౌన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ తదితరులున్నారు. శ్రీకూర్మంలోని కూర్మనాథుడిని కూడా ఆయన దర్శించుకున్నారు.

శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి ఉత్సవం



స్వామిని నంది,గజ,సింహ వాహనాల్లో ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని తిరువీధి ఉత్సవం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ముందుగా గణపతి పూజ అనంతరం ప్రత్యేక పూజలు చేసి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను చక్కగా అలంకరించి నంది, గజ, సింహవాహనాలపై ఉంచారు. అనంతరం పురవీధుల్లో నగరికటకం వరకు ఊరేగించారు. దేవాలయ సంప్రదాయం ప్రకారం నగిరికటం రామాలయం వద్ద ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం నైవేద్యాలు, మంగళ హారతులిచ్చారు. గ్రామ పెద్దలకు స్వామి వారి శేష వస్త్రాలు అందించి యథావిధిగా దేవాలయానికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షుడు పంచి రెడ్డి లింగమూర్తి, అర్చకులు, దేవదాయ శాఖ సిబ్బంది, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో వాసుదేవుని బ్రహ్మోత్సవాలు



వాసుదేవస్వామి

మందస: మందస పట్టణంలోని వాసుదేవ స్వామి 15వ బ్రహ్మోత్సవాలు 2024 ఫిబ్రవరిలో జరపడానికి వేదపండితులు నిర్ణయించారు. క్షేత్రపాలకుడు శ్రీఆంజనేయుని అభిషేకం ఆ నెల 28 నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు మార్చి 5వ తేదీ వరకు జరుగుతాయని శ్రీవాసుదేవ సేవాసమితి ప్రతినిధులు చెప్పారు. ఎంతో వైభవంగా జరిపే కల్యాణమహోత్సవం మూడున జరుగుతుందన్నారు. త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి, త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి, త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయని, భక్తులు విజయవంతం చేయాలని వారు కోరారు.

ఎచ్చెర్ల.. అందరూ మెచ్చేలా

బుడగుట్లపాలెంలో నిర్మితమవుతున్న ఫిషింగ్ హార్బర్ మత్స్యకారులకు బంగారు భవిష్యత్‌ను చూపిస్తోంది. ఎస్ఎం పురంలోని ట్రిపుల్ ఐటీ పేద విద్యార్థుల నుదుటి రాతలను మారుస్తోంది. ఎచ్చెర్లలోని బీఆర్‌ఏయూ మేడ్ ఇన్ శ్రీకాకుళం స్టూడెంట్స్ పవర్‌ను ప్రపంచానికి చూపిస్తోంది. ఇంటింటా అందుతున్న సంక్షేమం వెనుకబాటును మెల్లగా రూపుమాపుతోంది. ఎచ్చెర్ల అందరూ మెచ్చేలా ఎదుగుతోంది. ఇన్నాళ్లూ పైడిభీమవరం పారిశ్రామిక వాడతో పేరొందిన ఈ నియోజకవర్గానికి ఇప్పుడు కొత్త కీర్తి కిరీటాలు దక్కనున్నాయి. వైఎస్ జగన్ సర్కారు చేసిన మేలు ఇది. ఈ మంచిని వివరించేందుకు నేడు సామాజిక సాధికార యాత్ర నిర్వహించనున్నారు.





నిర్మాణంలో ట్రిపుల్ ఐటీ భవనాలు (ఇన్‌సెట్లో) నిర్మాణం పూర్తయిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలోని వసతి గృహం భవనం

సంక్షేమం పథకం	లబ్ధిదారులు
ఆసరా	70,848
అమ్మఒడి	53,749
చేదోడు	3,171
పంటల భీమా	12,913
ఈబీసీ నేస్తం	908
ఇన్‌పుట్ సబ్సిడీ	1,249
జగనన్నతోడు	6,936
జగనన్న వసతి దీవెన	16,670
జగనన్న విద్యాదీవెన	23,339
కాపు నేస్తం	3,401
మత్స్యకార భరోసా	7,128
నేతన్న నేస్తం	379
పాస్టర్స్	16
పెన్షన్లు	48,552
రైతు భరోసా	52,449
సున్నా వడ్డీ	83,236
వాహన మిత్ర	3,372
వైఎస్సార్ ఆరోగ్యఆసరా	12,210
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	14,300
వైఎస్సార్ భీమా	1,360
వైఎస్సార్ చేయూత	25,061
కల్యాణ మస్తు	687
హౌసింగ్ డీబీటీ	8,354
కోవిడ్ సాయం	89,319
విదేశీ విద్యా దీవెన	366

- ట్రిపుల్ ఐటీ, బీఆర్‌ఏయూ, ఫిషింగ్ హార్బర్లతో ఎచ్చెర్లలో ప్రగతి పరుగులు
- సంక్షేమ పథకాలతో మారిన పేద ప్రజల బతుకులు
- బలహీన వర్గాలకు రాజకీయ గౌరవం
- నేడు ఎచ్చెర్లలో సామాజిక సాధికార బస్సు యాత్ర

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : 'పేదలకి సంక్షేమం అందిస్తేనే అది సామాజిక పెట్టుబడిగా మారి అభివృద్ధి జరుగుతుంది..' నోబెల్ బహుమతి పొందిన ప్రముఖ ఆర్థిక వేత్త అభిజిత్ బెనర్జీ వ్యాఖ్య ఇది. సీఎం వైఎస్ జగన్ ఈ సూత్రాన్ని నిజం చేసి చూపిస్తున్నారు. అందుకు మరో ఉదాహరణ ఎచ్చెర్ల. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఇక్కడ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల జీవితాల్లో కొత్త వెలుగు వచ్చింది. ఒక్క పైసా అవినీతికి తావులేకుండా కోట్లాది రూపాయలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఇందులో 90శాతం నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చేరాయి. మరోవైపు బడుగులకు పాలనలో పెద్దపీట వేశారు. ఈ మేలును వివరించేందుకు సామాజిక యాత్ర సోమవారం ఇక్కడ నిర్వహించనున్నారు.

ఎచ్చెర్లలో రూ. 2035కోట్లకు పైగా లబ్ధి

నియోజకవర్గంలో 26 సంక్షేమ పథకాల కింద దాదాపు రూ. 2035కోట్ల 80లక్షల 86వేల 570మేర ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇందులో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) కింద రూ. 1666కోట్ల45లక్షల 33వేల 387 నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసింది. నాన్ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(నాన్ డీబీటీ) కింద ఇళ్ల స్థలాలు, గోరుముద్ద, జగనన్న తోడు రుణాలు, రేషన్, ట్యాబ్‌లు పంపిణీ, విద్యాకానుక, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కోసమని మరో రూ. 369కోట్ల 35లక్షల 53వేల183మేర ప్రభుత్వం ఖర్చు చేసింది. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల ఆధునికీకరణ, విలేజ్ హెల్త్ క్లినిక్, వెటర్నరీ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు తదితర వాటికి రూ.వందల కోట్లు ఖర్చు చేసింది.



పొన్నాడ- బొంతలకోడూరు తారు రోడ్డు

అభివృద్ధికి మరింత ప్రాధాన్యత

- మత్స్యకారుల కోసం రూ. 365.81కోట్లతో బుడుగుట్లపాలెం వద్ద ఫిషింగ్ హార్బర్‌ను నిర్మిస్తోంది.
- రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ట్రిపుల్ ఐటీ) విస్తరించింది. విద్యార్థుల తరగతులకు అవసరమైన భవనాలను నిర్మిస్తోంది. వీటి కోసం రూ.137 కోట్లు ఖర్చు చేస్తోంది.
- జిల్లాకే తలమానికంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రూ. 45కోట్లతో మరిన్ని భవనాలను నిర్మిస్తోంది.
- రూ.80కోట్లతో గ్రామ సచివాలయ భవనాలు, రూ. 22కోట్లతో రైతు భరోసా కేంద్రాలు, రూ. 16కోట్లతో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించింది.
- నియోజకవర్గంలో రూ. 50కోట్లతో సిమెంట్ రోడ్లు, కాలువలు, రూ.24కోట్లతో తారు రోడ్డు పనులు చేపట్టింది.
- అధ్వానంగా ఉన్న పాఠశాలలను పునర్నిర్మాణం చేపట్టింది. నాడు-నేడు కింద రూ. 85కోట్లతో పాఠశాలల రూపురేఖలు మార్చింది.
- రూ.5కోట్లు పెనసాం-నిమ్మలవలస వంతెనకు ఖర్చు పెట్టింది.

సామాజిక సాధికార యాత్ర షెడ్యూల్ ఇలా..



ఎచ్చెర్ల క్యాంపస్: సామాజిక సాధికార యాత్ర షెడ్యూల్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ చిలకపాలెంలో వివరించారు. ఉదయం 10 గంటలకు పైడిభీమవరం మహి గ్రౌండ్‌లో విశ్రాంత ఉద్యోగులు, కార్మిక సంఘ నాయకులు, మైనారిటీ మత పెద్దలతో ఆత్మీయ సమావేశం, 11 గంటలకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులు, 11.30 గంటలకు రణస్థలంలోని శ్రీ వెంకటేశ్వర కల్యాణ వేదిక వద్ద మీడియాతో సమావేశం, మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటలు వరకు భోజన విరామం, 1.35 గంటలకు బైక్ ర్యాలీ, 2 గంటలకు లావేరు మండలం బుడుమూరు గ్రామ సచివాలయం సందర్శన, మధ్యాహ్నం 3 గంటలకు చిలకపాలేంలో సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు.

యాత్ర విజయవంతం చేయండి



నరసన్నపేట: ఎచ్చెర్లలో సోమవారం సామాజిక సాధికార యాత్ర నిర్వహించనున్నామని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి, మంచి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లే సదుద్దేశంతో సామాజిక సాధికార యాత్రలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చిలకపాలేంలో భారీ బహిరంగ సభ సోమవారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



జగనన్న వల్లే చదువుకుంటున్నా..



రైతు కుటుంబంలో పుట్టి ఇంజినీరింగ్ చదవడం చాలా కష్టం. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన ఫీజ్ రీయింబర్స్‌మెంట్ పథకం వలన ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా రాజాం జీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో నాకు ఇష్టమైన సివిల్ ఇంజినీరింగ్‌లో జాయిన్ అయ్యాను. కాలేజీ ఫీజుతో పాటు హాస్టల్ ఫీజు కూడా ప్రభుత్వం ఇస్తుందనే నమ్మకంతో ఆర్థికంగా ఎలాంటి ఆందోళన లేకుండా చదువుకుంటున్నాను. నాలా ఎందరో మా కాలేజీలో ప్రభుత్వం అందిస్తున్న రీయింబర్స్‌మెంట్ వల్ల చదువుకుంటూ వారి కలలను సాకారం చేసుకుంటున్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మా నాన్న భాస్కరరావుకు రైతు భరోసా, 8వ తరగతి చదువుతున్న మాచెల్లికి అమ్మ ఒడి పథకాలు ఇచ్చి మా కుటుంబాన్ని, మా చదువుకు అన్ని విధాలా సహకరిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– బలిదే మణి, ఇంజనీరింగ్ విద్యార్థి, నందిగాం.

పింఛనే నన్ను బతికిస్తోంది..



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు సూదికొండ ప్రాంతం సచివాలయం పరిధిలో ఉన్న నాకు కిడ్నీ పూర్తిగా పాడైపోయింది. నేను ఊహించని రీతిలో ప్రస్తుతం నడవలేక గత కొన్ని నెలలుగా మంచానికి పరిమితమైపోయాను. నా భార్య రమాతో పాటు నాకు ముగ్గురు ఆడపిల్లలు ఉండేవారు. ఇద్దరం కష్టపడి పనిచేసి ముగ్గురు ఆడపిల్లలకు సైతం గౌరవంగా వివాహాలు జరిపించి అత్తవారింటికి పంపించాం. రాను రాను నాకు తెలియకుండా ఆరోగ్య సమస్యలు వచ్చాయి. ఏమిటని పరీక్షించడంతో నాకు కిడ్నీ సమస్య తగ్గనంత స్థాయికి చేరుకుందని తెలిసింది. ఒక్కసారిగా నా జీవితం తల్లకిందులైంది. దీంతో నేను ఇంటికి, మంచానికే పరిమితమైపోయాను. నా భార్య జీడిపరిశ్రమలో పనిచేస్తూ కూలిచేసి ఉన్న అప్పులు తీరుస్తూ వస్తోంది. నా వైద్యానికి, ఇంటి ఖర్చులకు డబ్బులు సరిపోవడం లేదు. అయితే జగనన్న సీఎం అయ్యాక నాకు ప్రతి నెలా అక్షరాలా రూ.10 వేల పింఛన్ వచ్చేలా చేశారు. ఆ డబ్బే ఇప్పుడు నన్ను బతికిస్తోంది. డయాలసిస్‌కు ఉచితంగా చేస్తున్నారు.

– నందిగాం గణేష్, కిడ్నీవ్యాధి బాధితుడు

కిడ్నీ ఆస్పత్రి చూద్దామా..!



కిడ్నీ ఆస్పత్రి వద్ద ఉద్దానం గ్రామాల పెద్దలు, ప్రజాప్రతినిధులు

పలాసలో నిర్మించిన కిడ్నీ ఆస్పత్రి చూసేందుకు పల్లె వాసులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఉద్దానం ప్రాంతంలోని రంగోయి, గురుదాసుపరం, నీలావతి, మాకన్నపల్లి, బొడ్డపాడు గ్రామాలకు చెందిన ఉద్దానం పెద్దలు ఆదివారం కిడ్నీ రీసెర్చ్ సెంటర్ చూసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్దానం ప్రజలకు ఇది ఆరోగ్య ప్రదాత అని కొనియాడారు. ఆస్పత్రిని చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఉద్దానం కిడ్నీ సమస్యకు ఇదొక పరిష్కారం చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక మంత్రి డాక్టరు సీదిరి అప్పలరాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

– పలాస

మౌనిక.. స్ఫూర్తి గీతిక



బిడ్డ ప్రభుత్వ ఉద్యోగం తెచ్చుకుందని ఆ తల్లిదండ్రులు సంబరపడ్డారు. పెళ్లీడే కావడంతో ఆ ముచ్చట కూడా తీర్చుకుందామని ఆశ పడ్డారు. కానీ యువతి నుదుటి రాత మరోలా ఉంది. రోడ్డు ప్రమాదం ఆ యువతిని అమ్మానాన్నలకు దూరం చేసింది. అంత విషాదంలోనూ అమ్మాయి తల్లిదండ్రులు బిడ్డ జ్ఞాపకాలు కాపాడుకుని మరికొందరికి కొత్త జీవితాలు ఇచ్చేందుకు ఓ అడుగు ముందుకు వేశారు. బ్రెయిన్ డెడ్ అయిన తమ బిడ్డ అవయవాలు దానం చేసేందుకు అంగీకరించారు. ఇప్పుడు మౌనిక గుండె తిరుపతిలోని మరో వ్యక్తిలో సజీవంగా స్పందిస్తోంది. ఆమె కళ్లు ఇంకా ఈ లోకాన్ని చూస్తున్నాయి. ఆమె అవయవాలు మరో ఇద్దరికి ప్రాణాలు పోశాయి.



నివాళులర్పిస్తున్న జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది

- రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఓ మౌనిక బ్రెయిన్ డెడ్
- అవయవాలను దానం చేసిన కుటుంబ సభ్యులు
- నలుగురి బతుకుల్లో వెలుగులు
- మరోసారి అవయవ దానానికి వేదికగా నిలిచిన జెమ్స్ ఆస్పత్రి



అవయవాలు తరలిస్తున్న దృశ్యం

గ్రీన్ చానెల్ ద్వారా తరలింపు..

- ఉదయం 12.35 గంటలకు మౌనిక అవయవాల డొనేషన్‌కు జెమ్స్ వైద్యులు శ్రీకారం చుట్టారు.
- అందులో భాగంగా గుండెను 2 గంటల 5 నిమిషాలకు బయటకు తీసి ఫ్రీజర్ బాక్సులో భద్రపరిచి గ్రీన్ చానెల్ ద్వారా జాతీయ రహదారి వెంబడి అంబులెన్స్ ద్వారా విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు 3 గంటల 10 నిమిషాలకు తీసుకెళ్లారు.
- గుండెను తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించనున్నట్లు వైద్యులు తెలిపారు.
- ఒక కిడ్నీని జెమ్స్ ఆస్పత్రిలోనే ఆరోగ్యశ్రీ ద్వారా ఒకరికి ట్రాన్స్‌ప్లాంట్ చేశారు.
- మరో కిడ్నీని 2 గంటల 40 నిమిషాలకు తీసి దాన్ని ఫ్రీజర్ బాక్సులో భద్రపరిచి విశాఖ పట్నంలోని కిమ్స్ ఐకాన్‌కు 3 గంటల 50 నిమిషాలకు గ్రీన్ చానెల్ ద్వారా తరలించారు.
- రెండు కళ్లను రెడ్‌క్రాస్ సంస్థకు డొనేట్ చేశారు.

శ్రీకాకుళం రూరల్: జెమ్స్ ఆస్పత్రి మరో అవయవదానానికి వేదికగా నిలిచింది. ఎచ్చెర్ల మండలం కొత్తపేట గ్రామానికి చెందిన బొడిగి మౌనిక (23) అవయవాలను దానం చేసి తల్లిదండ్రులు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. శ్రీకాకుళంలోని ఓ సచివాలయంలో వీఆర్వోగా పనిచేస్తున్న మౌనిక మూడు రోజుల కిందట విధి నిర్వహణలో ఉంటూ.. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో వినాయక ఆలయం వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తీవ్రంగా గాయపడిన మౌనికను వెంటనే రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి మెడికవర్‌కు తీసుకెళ్లి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖలోని అపోలోకు తరలించారు. అయితే అప్పటికే మౌనిక బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో అక్కడి నుంచి శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. మౌనిక శరీరంలో కదలికలు లేకపోవడం, పూర్తిగా బ్రెయిన్ పని చేయకపోవడంతో ఆమె శరీర అవయవాలను మరొకరిలో చూసుకునేందుకు తల్లిదండ్రులు గోవిందరావు, ఉమాదేవి ముందుకు వచ్చారు. జీవన్‌దాన్ వలంటీర్ దేవి కూడా వారికి అవగాహన కల్పించడంతో వారు సరే అన్నారు. దీంతో జెమ్స్‌లో అవయవదానానికి సిద్ధం చేశారు. గతంలోనూ ఇక్కడ కిరణ్‌చంద్ అనే విద్యార్థి అవయవాలను సేకరించి పంపించారు.

ఘనంగా నివాళి..

మౌనిక మృతదేహానికి విద్యార్థులు, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది అపురూపంగా నివాళులర్పించారు. ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో జెమ్స్ సీనియర్ మేనేజ్‌మెంట్ వైద్యులు డాక్టర్ సుధీర్, డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, డాక్టర్ అవినాష్, ఆర్‌ఎంఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. టౌన్ సీఐ సన్యాసినాయుడు, రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తూ జాతీయ రహదారి వెంబడి పర్యవేక్షించారు. మౌనిక డిప్లమా ఇంజినీరింగ్ పూర్తి చేసింది. సచివాలయ పరీక్షల్లో జిల్లాలోనే 18వ స్థానంలో నిలిచి వీఆర్వోగా ఉద్యోగం సంపాదించింది. ఈమెకు ఓ చెల్లి ఉంది.

తహసీల్దార్ పరామర్శ

మౌనిక మృతదేహాన్ని చూసి శ్రీకాకుళం తహసీల్దార్ ఎస్.వెంకట్రావు చలించిపోయారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి కలెక్టర్, ఆర్డీఓలు మౌనిక గురించి అడిగి తెలుసుకుంటున్నారని చెప్పారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. సచివాలయ సిబ్బందితో పాటు మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ద్వారా సేకరించిన మొత్తాన్ని వారికి అందజేశారు.



ఫ్రీజర్‌ను.. అంబులెన్స్‌లోకి ఎక్కిస్తూ..



విశాఖ బయల్దేరిన అంబులెన్స్‌కు వీడ్కోలు

క్లుప్తంగా

ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా కేశవరావు


కేశవరావును అభినందిస్తున్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం సభ్యులు

హిరమండలం: రాష్ట్ర ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.కేశవరావు అవార్డు అందుకున్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సాంఘిక శాఖ ఉపాధ్యాయుల ఫోరం అవార్డులను ప్రకటించింది. శ్రీకాకుళం జిల్లా నుంచి కేశవరావును ఎంపిక చేసింది. శనివారం విజయవాడలో రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ ప్రతాపరెడ్డి చేతులమీదుగా కేశవరావు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. హెచ్ఎం కేశవరావుకు పురస్కారం లభించడంపై ఎంఈఓలు కె.రాంబాబు,షన్ముఖరావులు, ఉపాధ్యాయులు, అటు ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్లు సైతం అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గిరిజన రైతు మృతి


మాళువ రవి (ఫైల్)

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడు పంచాయతీ సవరబొంతు గ్రామానికి చెందిన మాళువ రవి(40) శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆదివారం విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రవి గ్రామం నుంచి లంబ నరేంద్రతో కలసి ద్విచక్ర వాహనం మీద బొంతు జంక్షన్‌కు శనివారం రాత్రి 10.30 సమయంలో వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రవిని తొలుత ఐటీడీఏ అంబులెన్స్‌లో నరసన్నపేట ఆస్పత్రికి అక్కడి నుంచి శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అక్కడ పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలిస్తుండగా కేజీహెచ్‌కు సమీపంకు వెళ్లే సమయానికి మృతి చెందాడు.


లాసెట్ కౌన్సెలింగ్ జాబితాలో బీఆర్ఏయూ న్యాయ కళాశాల

ఎచ్చెర్ల క్యాంపస్: లాసెట్-2023 ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఈ జాబితాలో ప్రారంభంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మహాత్మా జ్యోతీరావు పూలే న్యాయ కళాశాల లేకపోవటంతో విద్యార్థులు ఆందోళన చెందారు. ఉన్నత విద్యా మండలి, బార్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా దృష్టికి సమస్యను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్ తీసుకువెళ్లారు. స్పందించిన అధికారులు జాబితాలో వర్సిటీ న్యాయ కళాశాలను చేర్చారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కళాశాల ఎంపిక జాబితాలో వర్సిటీ కళాశాల ఉంది. గతంలో ప్రైవేట్ కళాశాల ఎంపిక చేసుకున్న విద్యార్థులు మళ్లీ ఆప్షన్ల మార్పులో వర్సిటీ కళాశాల ఆప్షన్ ఇచ్చుకోవచ్చు. ఆప్షన్ల ఎంపిక నోటిఫికేషన్ మేరకు ఈ నెల 25న ప్రారంభం కాగా, 27వ తేదీ వరకు కొనసాగనుంది. 28న కళాశాలల ఆప్షన్ మార్పునకు అవకాశం కల్పించారు. వర్సిటీలో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి 66 సీట్లు ఉన్నాయి. అర్హులైన విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనలు వర్తిస్తాయి. ఈ నెల 30వ తేదీన సీట్లు ప్రకటిస్తారు. డిసెంబర్ 1, 2 తేదీల్లో సీటు లభించిన కళాశాలలో విద్యార్థులు చేరాల్సి ఉంటుంది. వర్సిటీలో న్యాయ విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ కోరారు.

గుర్తు తెలియని రైలు ఢీ కొని మహిళ మృతి

ఆమదాలవలస: స్థానిక రైల్వేస్టేషన్ పరిధి వెంగళరావు కాలనీ సమీపంలో అప్‌లైన్ ట్రాకుపై ఆదివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు జీఆర్పీ హెచ్‌సీ సీహెచ్ చక్రధరరావు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహం వద్దకు చేరుకున్నామని తెలిపారు. రైలు ఢీకొని మృతి చెంది ఉంటుందని తెలిపారు. మృతురాలు సుమారు 45 వయస్సు కలిగి ఉంటుందని, లేత గులాబీ రంగు టాపు, నాచుకలర్ చలికోటు ధరించి ఉన్నారన్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు ఆమదాలవలస జీఆర్పీ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించామన్నారు. దీనిపై జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వరికుప్ప దగ్ధం


వరికుప్ప మంటలను ఆర్పుతున్న స్థానికులు

హిరమండలం: హిరమండలం నౌగూడ గ్రామ సమీపంలో ఎస్.శిమ్మయ్య అనే రైతుకు చెందిన వరి కుప్ప ఆదివారం ఉదయం అగ్నికి ఆహుతైపోయింది. దాదాపు ఎనభై సెంట్ల ఫలసాయం కాలిపోవడంతో రైతు గుండెలవిసేలా రోదించారు. స్థానికులు మంటలను చూసి ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. కొత్తూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తెచ్చారు.

విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- కరెంట్ కష్టాలకు తెర
- రూ.46 కోట్లతో విద్యుత్ స్టోరేజీ సబ్‌స్టేషన్ నిర్మాణం
- కొత్తూరు వద్ద 2.5 ఎకరాల్లో ఏర్పాటు
- స్థల పరిశీలన చేసిన ఏపీ ట్రాన్స్‌కో నిర్మాణ విభాగం అధికారులు
- ఈ నెల 28న వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేయనున్న సీఎం జగన్
- ఫలించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృషి


ఎమ్మెల్యే రెడ్డి శాంతికి వివరాలు తెలియజేస్తున్న విద్యుత్ శాఖ ఈఈలు

ఎల్.ఎన్.పేట: దశాబ్దాలుగా నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఎదురు చూస్తున్న విద్యుత్ వినియోగదారుల సమస్యలకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. పాతపట్నం నియోజకవర్గ ప్రజల విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. కొత్తూరు కేంద్రంగా రూ.46.08 కోట్ల వ్యయంతో 2.5 ఎకరాల విస్తీర్ణంలో విద్యుత్ స్టోరేజీ 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. విద్యుత్ సమస్యను పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం నిధులు కేటాయించింది. విద్యుత్ స్టోరేజీ నిర్మాణ పనులకు ఈ నెల 28న సీఎం జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసేందుకు విద్యుత్ శాఖ నిర్మాణ విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా స్థల పరిశీలన, పనులు చేపట్టేందుకు అవసరమైన సాంకేతిక విధి విధానాలను పరిశీలించారు.

స్టోరేజీ ఇలా..

గరివిడి మెయిన్ లైన్ నుంచి వచ్చిన విద్యుత్‌ను కొత్తూరు వద్ద కొత్తగా నిర్మించే విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద స్టోరేజ్ చేస్తారు. ఇక్కడి నుంచి హిరమండలం, కొత్తూరు తదితర మండలాలకు విద్యుత్ సరఫరా చేస్తారు. స్టోరేజ్ పాయింట్ పనులు పూర్తయితే గృహావసరాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తారు. వ్యవసాయ మోటార్లకు పగటి పూట 9గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగే అవకాశముంటుంది.

పాతపట్నం నియోజకవర్గంలో విద్యుత్ వివరాలు ఇలా..

మండలాలు	05
విద్యుత్ సబ్‌స్టేషన్లు	09
సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు	876
త్రిపుల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు	1,019
పరిశ్రమలు	27
లిఫ్ట్ ఇరిగేషన్లు	11
కేటగిరి–1 కనెక్షన్లు	72,485
కేటగిరి–2 కనెక్షన్లు	6,491
కేటగిరి–3 కనెక్షన్లు	245
కేటగిరి–4 కనెక్షన్లు	2,434
కేటగిరి–5 కనెక్షన్లు	1,408

జగనన్నకు కృతజ్ఞతలు..

పాతపట్నం నియోజకవర్గానికి ఎక్కడి నుంచో విద్యుత్ సరఫరా కావటం వల్ల వినియోగదారులకు ఇబ్బందులు తప్పటం లేదు. గిరిజన గ్రామాలతో పాటు మారుమూల గ్రామాలకు సమస్య మరింత పీడిస్తునే ఉంది. సమస్యను సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి విద్యుత్ స్టోరేజ్ పాయింట్ కావాలని అడిగి పట్టుపట్టి సాధించాను. రాష్ట్రంలో 18 విద్యుత్ స్టోరేజ్ పాయింట్లు మంజూరు చేస్తే అందులో ఒకటి పాతపట్నం నియోజకవర్గానికి ఇచ్చారు. ఇందుకు జగనన్నకు కృతజ్ఞతలు.

– రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

28న శంకుస్థాపన

విద్యుత్ స్టోరేజీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ఈ నెల 28న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేస్తారు. అదే సమయంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి స్థానికంగా జరిగే శంకుస్థాపన పనుల్లో పాల్గొంటారు. పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– మంచు శ్రీనివాసరావు, సురేంద్ర, ఏపీ ట్రాన్స్‌కో నిర్మాణ విభాగం ఈఈలు

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన

- స్పీకర్ తమ్మినేని సీతారాం


బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ పాలన సాగుతోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. దేశ సుస్థిర మనుగడకు రాజ్యాంగ పీఠిక ఆధారమని, అంబేడ్కర్‌ను ఈ దేశం ఎన్నటికీ మరువబోదని అన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాలకు అన్ని విధాలుగా న్యాయం జరిగేలా పారదర్శకమైన పాలన అందిస్తున్నారన్నారు. కొన్ని వర్గాల వారికే పరిమితమైన రాజ్యాధికారాన్ని అంబేడ్కర్ పేర్కొన్న రిజర్వేషన్ల పరంగా అందరికీ సమాన హక్కులు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందని అన్నారు. సామాజిక సాధికారిక చర్యల ద్వారా చట్టసభల్లో, నామినేటెడ్ పదవుల్లో, పార్టీ పదవుల్లో ప్రతి ఒక్క సామాజిక వర్గానికి భాగస్వామ్యం కల్పించారని తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీల కుట్రలు, కువిమర్శలు ప్రజలకు తెలుసని, సీఎం వైఎస్ జగన్ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డేపల్లి నారాయణరావు, బగాది నారాయణమూర్తి, అల్లంశెట్టి ఉమామహేశ్వర రావు, సాదు చిరంజీవి, చిన్నారావు, పొన్నాడ చిన్నారావు, విజయ్, పొడుగు శ్రీనివాసరావు, బొడ్డేపల్లి రమణ మూర్తి, బొడ్డేపల్లి రాజు, బడాన సునీల్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులు అద్భుతాలు సృష్టిస్తారు


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, పక్కనే జేసీ నవీన్ తదితరులు


షాట్‌పుట్ విసురుతున్న బాలుడి ప్రతిభను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఇతర అధికారులు

- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

శ్రీకాకుళం న్యూకాలనీ, శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విభిన్న ప్రతిభావంతులకు జిల్లా స్థాయి ఆటల పోటీలను ఆదివారం నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ తొలుత బాలికల పరుగు పందేలను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న వివిధ క్రీడల్లో క్రీడాస్ఫూర్తితో రాణించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దివ్యాంగులను ప్రోత్సహిస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుచేయడమే కాకుండా జిల్లా స్థాయి ఆటల పోటీలను నిర్వహించేలా ప్రోత్సహిస్తుండటం గర్వకారణమన్నారు. ఈ ఆటల పోటీల్లో సుమారు 400 మంది విభిన్న ప్రతిభావంతులు పాల్గొనడం అభినందనీయమని సంతోషం వ్యక్తం చేశారు. విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్ జెండర్స్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు డిసెంబరు 3న నిర్వహించనున్న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, జిల్లా పర్యాటక అధికారి నడిమింటి నారాయణరావు, డీపీఆఓ కె.బాలమాన్‌సింగ్, డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లిలో 'కార్తీక' సందడి


ఇంద్రపుష్కరిణిలో కార్తీక దీపాలను విడిచిపెడుతున్న మహిళలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి సన్నిధిలో కార్తీక సందడి కనిపించింది. కార్తీక ఆదివారం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. అంతరాలయంలో ప్రత్యేక పుష్పాలంకరణలో ఆదిత్యుని మూలవిరాట్టు దర్శనమివ్వడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం ఒక్కరోజున వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,82,400, విరాళాల ద్వారా రూ.52,062, లడ్డూ,పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3.20 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఈఓ హరిసూర్య ప్రకాష్ తెలిపారు. అలాగే స్వామిని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి ఆదివారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. ఆమె వెంట ఆలయ పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి తదితరులున్నారు.

వీధుల్లో కార్డన్ సెర్చ్


వీధుల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: గోపీనాథపురంలో ఆదివారం ఉదయం టెక్కలి పోలీసులు కార్డర్ సెర్చ్ నిర్వహించారు. టెక్కలి సీఐ సూర్యచంద్ర మౌళి ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్ఐలతో పాటు 45మంది సిబ్బంది ఉదయం సుమారు 6 గంటల సమయంలో కార్యక్రమం నిర్వహించి ప్రతి ఇంటినీ తనిఖీ చేశారు. వీధుల్లో ఉన్న ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోల రికార్డులను పరిశీలించారు. అనంతరం రికార్డు లేని వాహనాలను పోలీసులు అదుపులో తీసుకున్నారు. అనంతరం అక్కడ ప్రజలతో మాట్లాడుతూ వీధుల్లో అపరిచిత వ్యక్తులు తిరిగినా అనుమానాస్పద స్థితిలో ఎవరైనా కనిపించినా సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టెక్కలి ఎస్ఐ రామకృష్ణతో పాటు నందిగాం, కోటబొమ్మాళి ఎస్ఐలు, ఎస్ఐ-2, ఎఎస్ఐల తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర నోడల్ అధికారి తారక్ ప్రసాద్

రణస్థలం: కేంద్ర పథకాలపై అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది వినియోగించుకోలేకపోతున్నారని ఐ అండ్ పీఆర్ విశాఖపట్నం రీజనల్ డైరెక్టర్, ఉత్తరాంధ్ర ప్రత్యేక నోడల్ అధికారి తారక్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని కోటపాలెం గ్రామంలో ప్రధానమంత్రి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎల్‌సీడీ వ్యాన్లలో ప్రత్యేకంగా అమర్చిన ఎల్‌సీడీ స్క్రీన్లపై కేంద్రం ప్రభుత్వ ప్రవేశపెట్టిన 17 సంక్షేమ పథకాలను ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. ఏ పథకానికి ఎవరు అర్హులో వివరించారు. స్థానికంగా పథకాలు పొందిన వారి వివరాలు ప్రస్తావించారు. కార్యక్రమంలో జెడ్పీసీఈఓ ఆర్.వెంకటరమణ, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎస్.అనురాధ, మండల ప్రత్యేకాధికారి బి.దుర్గారావు, ఎంపీడీఓ ఆర్‌వీ రమణమూర్తి, కోటపాలెం సర్పంచ్ గొర్లె జగదీశ్వరరావు, ఎంపీటీసీ సుంకరి కిషోర్, గ్రామనాయకులు గొర్లె తిరుపతినాయుడు, జోగ శ్రీనివాస యాదవ్, లెంక అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి రౌతు శ్రీధర్, అధికారులు, తదితరులు ఉన్నారు.

ఆశ్రా కార్యక్రమంలో జిల్లాకు గుర్తింపు

కాశీబుగ్గ: దేశ రాజధాని ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ ఆఫ్ ఇండియా క్లబ్‌లో జరిగిన అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్ కార్యక్రమంలో జిల్లాకు ప్రత్యేక గౌరవం దక్కిందని జిల్లా జాయింట్ సెక్రటరీ జీఎంఎస్ అనిల్‌రాజ్ తెలియజేశారు. దేశంలో 12 రాష్ట్రాలతో పాటు అమెరికా, దక్షిణకొరియా, దుబాయ్ నుంచి కూడా ఆశ్రా ప్రతినిధులు హాజరయ్యారు. అనిల్ రాజ్ మాట్లాడుతూ ఆశ్రా శ్రీకాకుళం టీమ్‌కు దేశవ్యాప్తంగా ప్రత్యేకమైన గౌరవం, గుర్తింపు లభించిందని తెలియజేశారు.

'యాదవ దివ్యచరిత్ర' రచయిత మృతి

నందిగాం: ఆకులనందిగాం గ్రామానికి చెందిన రచయిత, జర్నలిస్టు ఇప్పిలి పాపారావు(69)ఆదివారం అనారోగ్యంతో మరణించారు. నందిగాంలో నివాసం ఉంటున్న పాపారావు జిల్లా అఖిల భారత యాదవ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నారు. ఎనిమిదేళ్లు రాష్ట్రమంతా పర్యటించి శ్రీక్రిష్ణా యాదవ దివ్య చరిత్ర పుస్తకాన్ని రచించి విడుదల చేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా జిల్లా, నందిగాం మండల యాదవ కుల సంక్షేమ సంఘాలతో పాటు, నందిగాం పంచాయతీ క్రీడాకారులు సంతాపం తెలిపారు.

పూరిల్లు అగ్నికి ఆహుతి


అగ్నికి ఆహుతవుతున్న పూరిల్లు

ఇచ్ఛాపురం రూరల్: కేదారిపురం గ్రామానికి చెందిన నర్సింగ్ శెట్టి పూరిల్లు ఆదివారం రాత్రి కాలిబూడిదైంది. వివరాల్లోకి వెళితే.. నర్సింగ్ శెట్టి ఇంటిపై కప్పు నుంచి రాత్రి అగ్గి రవ్వలు ఎగసిపడటం చూసిన స్థానికులు అప్రమత్తమై ఇచ్ఛాపురం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో వచ్చినప్పటికీ గడ్డిల్లు కావడంతో క్షణాల్లో కాలిపోయింది. ఇంటిలో ఉన్న సామగ్రి, ధాన్యం, బియ్యం, డబ్బులు దగ్ధమయ్యాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా గ్రామంలో యువకులు బాణసంచా కాల్చడంతో ఈ సంఘటన జరిగి ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. సుమారు రూ.రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఈ పేద కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ నీలాపు సారధిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సాడి జగదీష్‌రెడ్డి కోరుతున్నారు.

కార్తీక వెలుగు


చింతాడ గ్రామంలో వెలిగించిన సహస్ర దీపాలు

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి చింతాడ గ్రామంలో కార్తీక పౌర్ణమి శోభ కనిపించింది. ఆదివారం కార్తీక పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆ గ్రామంలో గల కోదండరామస్వామి ఆలయంలో సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. వివిధ ఆకారాల్లో ఏర్పాటు చేసిన ఈ దీపాలంకరణ ఆకట్టుకుంది.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కాశీబుగ్గ:

పలాస మండలం తర్లాకోట గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తర్లాకోట గ్రామానికి చెందిన పాండవ అనే యువకుడు మృతి చెందాడు. పలాస–గొప్పిలి రోడ్డు తర్లాకోట గ్రామానికి సమీపంలో ఉన్న కాటమ్మతల్లి ఆలయం వద్ద ఘటన జరిగింది. యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అయినా ఆ వాహనం ఆపకుండా వెళ్లిపోయింది. తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉన్న పాండవను స్థానికులు, వాహనదారులు గమనించి 108 ప్రభుత్వ అంబులెన్సుకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్సు సిబ్బంది సత్యం, శ్రీనివాసరావు ప్రథమ చికిత్స అందించి అతడిని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేశారు.


తీవ్ర గాయాలైన పాండవను తరలిస్తున్న అంబులెన్సు సిబ్బంది

ఆటోవాలా దొరికాడు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం సమీపంలో ఇద్దరు మహిళలను ఆటో నుంచి నెట్టివేసిన ఆటోవాలాను పోలీసులు పట్టుకున్నారు. సీఐ కామేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. గార మండలం కొయ్యానపేటకు చెందిన గొంగుల అప్పన్న ఇద్దరు మహిళలను తన ఆటోలో అరసవిల్లి మిల్లు జంక్షన్ కూడలిలో గురువారం (ఈనెల 28న) రాత్రి ఎక్కించుకొని ఆటో శిమ్మపేటలో ఆపకుండా వెళ్లిపోయాడు. అనంతరం ఆటోలోని మహిళలను కిందకు నెట్టివేశాడు. దీనిపై పోలీసులు అరసవల్లి, అరసవల్లి మిల్లు జంక్షన్ల వద్ద సీసీ ఫుటేజీని పరిశీలించి రిజిస్ట్రేషన్ నంబరు గుర్తించి వివరాలను సేకరించగా అప్పన్న అని తెలిసింది. విచారణలో తనకు ఆ సమయంలో ఫిట్స్ వచ్చిందని, వారి మాటలు తనకు వినబడలేదని చెప్పడం గమనార్హం. దీనిపై అప్పన్నపై బైండోవర్ కేసు నమోదు చేయడమే కాక ఆటోను సీజ్ చేశామన్నారు. ఆటోవాళ్లు పరిమితికి మించి లోడుతో వెళ్లినా, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికినా, అత్యంత మోతాదులో లౌడ్‌స్పీకర్లతో వెళ్లినా చర్యలు తప్పవని హెచ్చరించారు. తప్పనిసరిగా వారి వివరాలు తెలిపే చార్ట్‌ను ఆటోలో ఉంచాలన్నారు.

ఏళ్ల నాటి కల సాకారం


మంత్రి సీదిరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న పార్టీ నాయకులు, ప్రజలు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన, తీర ప్రాంత ప్రజల దశాబ్దాల కల మంత్రి సీదిరి అప్పలరాజు చొరవతో నెరవేరనుంది. మందస, వజ్రపుకొత్తూరు మండలాలను అనుసంధానం చేసే రాకాసి గెడ్డపై వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఈ మేరకు ఆయా ప్రాంతాలకు చెందిన పార్టీ నాయకులు, ప్రజలు మంత్రి కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర మంత్రి అప్పలరాజుని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గత పాలకుల హయాంలో అనేక సార్లు ఈ సమస్య విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని, పాదయాత్రలో సీఎం వైఎస్ జగన్ మాట ఇచ్చారని, ఆ మాటకు కట్టుబడి, మంత్రి అప్పలరాజు కృషితో వంతెన మంజూరు చేయడం సంతోషకరమని అన్నారు. మంత్రి కలిసిన వారిలో మండల ప్రత్యేక ఆహ్వానితులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, శ్రీ ఆదిబలిజ సంఘ అధ్యక్షుడు గుంటు వల్లభరావు, ఆలయ కమిటీ చైర్మన్ నేతాడ జగన్నాథరావు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చిన్నారుల వైద్యానికి ఆర్థిక సాయం


చిన్నారుల వైద్యానికి ఆర్థిక సాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, ఎస్వీ ప్రసాద్

ఇచ్ఛాపురం రూరల్, కవిటి: కేసుపురం గ్రామానికి చెందిన కవల పిల్లలు శివంగి హర్షవర్ధన్, హర్షితలు వైద్యానికి దాతలు స్పందిస్తున్నారు. ఆదివారం కవిటి మండలం బొరివంక గ్రామానికి చెందిన 'హెల్పింగ్ హ్యాండ్స్ క్లబ్' సభ్యులు రూ.10వేలు, జగతి గ్రామానికి చెందిన విశ్రాంతి డీఎస్పీ శమల్ల వరప్రసాద్ రూ.5వేలు చిన్నారుల వైద్యానికి కుటుంబ సభ్యులకు అందజేశారు.